# ఆకాశవాణి కథలు

✽

## = శ్రీ శిష్ట్లా ఉమామహేశ్వరరావు =

ఆకాశవాణి అనుకుంది: "ఈ ప్రపంచమంతా పగిలిపోతున్నది. ఏమూల జూచినా ఏడుపు లెక్కువౌతున్నాయి. ఎవరిని జూచినా 'ఈ అలజళ్లేమిటి, నూతనరాజ్యాంగపద్ధతులు రావా'లంటున్నారు. అన్నవారు నూతను లవుతున్నారా? 'మేము మాపంథాలోనే ఉండాలి, మీరు మారాలి' అనే తత్వంవల్ల ఏ నూతనపద్ధతి రాగలదు? మారాలి అన్నవాళ్లు మార్పుచూపించాలి. మారుదాం అన్నవాళ్లే మర్యాదగలవాళ్లు. మేము మారినాం, మారుతున్నాం, అంతా మారుదాం, లేకపోతే మారణహోమాలు అణిగిపోవు అనేవాళ్లే నీతిమంతులు. వీరివల్లనే ఏవైనా నూతన కార్యక్రమాలు రావాలి. ఇటువంటివా రున్నారా? ఒక్కడుంటే చూచేవాళ్లల్లో కొంతమందికైనా ఇంగితం కలుగుతుంది. ఇద్దరుంటే సంప్రతింపు ఆరంభమౌతుంది. సంప్రతింపులోంచి సహకారం ఉద్భవిస్తుంది. ఇట్లాంటివారు ఎక్కువమంది ఉంటే సమస్య లెప్పుడో పరిష్కారాలౌతాయి.

మహత్తరకార్యాలకు మహత్తర సంస్కారముండాలి. అటువంటి కృషికే నూతనసృష్టి వశమవుతుంది. ఇరుపక్షా లున్నప్పుడు ఉభయత్రా ఉద్దేశాలు మంచివైతే వారధినిర్మాణానికి ఏ ఉడుతైనా ఉద్యుక్తమౌతుంది. గనుకనే నూతనరాజ్యాంగాలు రావాలంటే నూతనపురుషులు రావాలి. ప్రతివాడూ యీ ప్రపంచ సౌధానికి చిన్న రాయే. అయితే, సరిపోయే చెక్కబడిన రాయేనా? కాకపోతే సౌధానికి గట్టిలేదు—అందం లేదు. ఎవరంతట వారు చెక్కుకుని కుదురుబాటు ఏర్పరచుకోవాలి! అట్టివారినే భగవంతుడు కట్టడమందు ఉపయోగిస్తాడు. ఈ ప్రపంచం అంతా ఒక్క కట్టడంక్రింద ఎప్పుడు నిర్మాణమవుతుందో! ఈ నూతననిర్మాణానికి కావాలిసిన నూతనపురుషులను తయారుచేద్దాం. ప్రపంచంలో పరివర్తన కలిగిద్దాం!"

అవతరించింది ఆకాశవాణి. అనుకుంది మళ్లీ ఈ విధంగా: "నూతనానికి ప్రాతిపదిక యేది? పాతతనాన నిలచిన అప్పులు తీరితేనేగాని నిజమైన నూతనత వికసించదు. వ్యక్తిజీవితంలో అప్పులు తీరనంతకాలమూ కుదురుబాటు ఎలా అరుదో అలాగే విశ్వజీవితంలోనూ అప్పులు తీరితేనేగాని స్థిరపాటు చిక్కదు. అస్థిరపాట్లవల్లనే అలజళ్లు. అలజడిమనస్సులే యుద్ధాలకు కారకాలు. పాతది మరిచిపోదాం—కొత్తది ఆరంభించుదాం అనుకోవడం పొరపాటు. మరుపులురాని మరుగు లుంటేనో?

తప్పులు దిద్దుకుందాం, అన్యాయాలు అణచివేద్దాం అనుకుంటేనే నూతనత బోధపడుతుంది.

మేము ప్రభువులం—నీచాలు నిలిపివేస్తాం, నీతిమార్గంలో నిలుస్తాం అన్నప్పుడు పటుత్వం గల ప్రభువర్గాలు కలుగుతవి.

మేము భారతీయులం—అత్యాచారాలు ఆపివేస్తాం, విభేదాలు విసర్జించుతాం, క్రమజీవితంలో కలిసిపోతాం అన్నప్పుడు భారతభాగ్యోదయం.

ప్రతివారూ—అక్రమాలను అరికట్టుతాం, పరస్పరతను పెంపొందించుతాం. ఒక జాతితోనే కాదు, ఒక దేశంతోనే కాదు అన్ని జాతులతో, అన్ని దేశాలతో యీ ప్రపంచం అవిజేయంగా వృద్ధిగావాలి అన్నప్పటినుంచీ అంతర్జాతీయసహకారం ఏర్పడుతుంది. నేను వ్యక్తిని—నాజీవితంలో సవరింపులు చేసుకోకుండా ఇతరులను ఆక్షేపించను. నామార్పుతోగాని

ఏమార్పూ గోచరించదు అనేవాండ్ల కూర్పుతోనే నూతనసృష్టిలోని భావిప్రపంచపు బల్లకట్టు.

నూతనసృష్టిలో నిజమానవుడు నేర్చే మొదటి పాఠం ఇరుగుపొరుగుతో ఇరవుగా ఉండడం."

"భూసంచారంచేదాం. ప్రజల అంతరంగంలో పలుకుదాం. కొంతమందినైనా మారుద్దాం" అనుకుంది ఆకాశవాణి.

* * *

## 1. అపోహ

"ఫరవాలేదులేవే అమ్మా! విసుక్కోకు. మనం ఉండొచ్చిన ఇల్లు చూడడానికి డాబేగాని ఈ ఇల్లే చిన్నఇల్లయినా బాగుంది. సముద్రపుగాలిగూడా దగ్గిరే ఉంది... ప్రెస్సులో నాకు అయిదు రూపాయిలు హెచ్చుగూడా చేశారు. నే ఉండంగా నువ్వు దిగులు పడవాకు. సరేనా?" అన్నాడు రాధాకృష్ణమూర్తి.

రాధాకృష్ణమూర్తితల్లి సుందరమ్మ. భర్త బ్రతికి ఉన్నప్పుడు బాగానే వెళ్లిపోయింది సంసారం. ఆయన పోయింతర్వాత కష్టాలొచ్చాయి.

సుందరమ్మకు నలుగురు పిల్లలు. పెద్దవాడే రాధాకృష్ణమూర్తి. పంధొమ్మిదేండ్లుంటాయి. ప్రెస్సాఫీసులో ముప్పైయైదురూపాయిలుద్యోగం. ఇంటి కాధరు వాతడే. మిగతవాళ్లు అతనికన్న చిన్నలు. శేషుకు పదేండ్లుంటాయి. సరస్వతికి ఏడేండ్లు. ఆఖరుకుర్రాడికి రెండేండ్లు.

బాగా బ్రతికినవాండ్లు, నీతిగా బ్రతికినవాండ్లు, శుభ్రంగా బ్రతికినవాండ్లు అవటంచేత ఇప్పుడు ఆదాయం ముప్పైయైదైనా ఉన్నంతలో పొదంగా వాడుతూ, పిల్లలను పరిశుభ్రంగా ఉంచేది సుందరమ్మ.

మొట్టమొదట అప్పీ ఇప్పీ అమ్ముకుని ఉన్నయింట్లోనే చాలాకాలం ఉన్నారు. కొంతకాలానికి అద్దె భరించలేక ట్రిప్లికేనులోనే ఒక చాలా చిన్నయింట్లో రెండుభాగాలల్లో ఓ భాగం తీసుకునిఉన్నారు.

"ఫరవాలేదులేవే అమ్మా" అని కుమారుడు నవ్వుముఖంతో అన్నప్పుడు తాను విచారం చూపిస్తే బాగుండదని "సరేలేరా అబ్బాయి. నీవుపో, ఆఫీసు వేళయింది. నే నిల్లు సర్దుకుంటా!" అంది.

చాలాకాలం పనిమనిషిసాయం ఉండేది సుందరమ్మకు. ఇప్పుడు బీదరికంతో తానే అన్నిపనులూ చేసుకుంటున్నది.

ఇన్నాళ్లూ పిల్లలు వీధిబడికిపోయారు. శేషు పెద్దవాడవుతున్నాడు. స్కూలుకుపోతే జీతంకావాలి.

"శేషునుగూడా ఏదో ఓపనిలో ప్రవేశపెడితేనో" అనుకుంది చాలాసార్లు సుందరమ్మ. "అహ! కాస్తో కూస్తో చదువుచెప్పించాలి అని పట్టుపట్టింది. పెద్దబ్బాయి యెంత కష్టపడుతున్నాడు పాపం. వాడు బుద్ధిమంతుడు కావడమే ఆవిడబీదరికంలో మిగిలిన అదృష్టం.

తానే ఏదైనా పనిజేస్తే బాగుండు ననుకుంది సుందరమ్మ. నిజమే! కుట్టుపనిమిష నుంటే బాగుండును. రవికలూ, పిల్లలచొక్కాలూ కుట్టవచ్చు.

"అబ్బాయి, చూడూ!"అంది సుందరమ్మ ఓరోజు సాయంకాలం రాధాకృష్ణమూర్తితో.

"ఏమిటే అమ్మా"అని అడిగాడు.

"అద్దెకైనాసరే ఓ కుట్టుపనిమిషను తెస్తే బాగుండునురా. ఇంత సంసారానికి నువ్వొక్కడవే కష్టపడుతున్నావు. నేనూ ఏదైనా సంపాయిస్తా!"

కాసే పూరకున్నాడు రాధాకృష్ణమూర్తి. ఆలోచించాడు. తర్వాత తల్లితో అన్నాడు: "నిజమేనే అమ్మా! శేషుగూడా స్కూలుఫైనలుదాకా చదువుకుంటే ఏ ముప్పైయో సంపాదించవచ్చు. అందాకా కష్టపడదాం. రేపే కనుక్కుని తెస్తా!"

సుందరమ్మ కుట్టుపనిమీద కొద్దికొద్దిగాసంపాదిస్తున్నది. సంసారం ఓవిధంగా జరిగిపోతున్నది. అయితే గోరుచుట్టుమీద రోకటిపోటు! కష్టాలు కలిసొస్తాయి!

పిల్లలకు స్ఫోటకం పోసింది. సుందరమ్మకు పక్షవాతం వచ్చింది. మందులకు డబ్బు కావాలి. ఎక్కడనుంచి వస్తుందీ! చెయ్యి పడిపోవడంతో

కుట్టుపని పడిపోయింది. అదేరోజుల్లో కట్టెలు ప్రియమయినాయి.

"కట్టెలు జాగ్రత్తగా వాడాలే అమ్మా! ఇదివరకు మనం ఉండొచ్చిన ఇంట్లో ఎప్పుడూ కట్టెలు పోవడమే. ప్రియమైనైకూడా!" అన్నాడొకరోజున రాధాకృష్ణమూర్తి.

"నిజమేరా! ఈఇంటి కొచ్చింతర్వాత కట్టెలు చాలారోజు లొస్తున్నాయి. ఇక్కడ కట్టెలు దొంగిలించేవాళ్లు లేరుకాబోలు. మన పక్కభాగంలో ఆయన ఒక్కడే ఉంటాడు. పెళ్లాంపిల్లలు లేరుకాబోలు. ఆయ నేం కట్టెలు దొంగిలించడుగదా!"

"ఏమో, ఎవరు చూశారు! ఆయనపేరు రంగారావుట. ఏంఉద్యోగమోకూడా ఎవరికీ తెలియదు. ఊళ్లోకి పోతాడు, వస్తాడు. మహా పిసినాసి. డబ్బు కూడపెడతాట్ట. సంచులుసంచు లున్నాయ్యంటారు. ఒక కానీ ధర్మంచేసిన పాపాన పోలేదట."

"భగవంతు డటువంటివాళ్లకే ధనం ఇస్తాడు. నలుగురుపిల్లల తల్లిని నామీద కనికరం లేదు."

"కనికరం వస్తుంది లేవే. అన్ని వేళలూ ఒకేమాదిరుంటాయా!"

"అందరు కుమార్లూ నీవంటివా ళ్లుంటారా నాతండ్రీ."

"సరేగాని, కట్టెలు జాగ్రత్తగా వాడు. కనిపెట్టి చూడు."

"ఏమో! మన దొడ్డికీ, ఆయనదొడ్డికీ పిట్టగోడే అడ్డం. పిసినాసివాళ్లకు దొంగబుద్ధులుగూడా ఉంటాయి. సరేలే!"

కొన్నాళ్లు గడిచాయి. బీదరికం దుర్భరంగా ఉంది. అయినా పిల్లల గుడ్డలదగ్గిరనుంచీ చాకిరీ తానే చేస్తూ పిల్లలను పరిశుభ్రంగానే ఉంచుతున్నది. రాధాకృష్ణమూర్తిగూడా ఉన్నంతలో శుభ్రమైన దుస్తులే వేస్తున్నాడు. కాని ఇరుగుపొరుగువాళ్లొక్కళ్లూ "ఎట్లా ఉంది మీసంసారం" అని పలకరించినవాళ్లు లేరు.

రంగారావు పక్కభాగంలోవాడైనా, చాలా డబ్బున్నవాడని వాడుక ఉన్నా అసలే పిసినాసి.

రంగారావునూ, అతని పిసినాసితనాన్నీ తలవని రోజు లేదు సుందరమ్మ. అతన్ని తలిచినప్పుడల్లా కట్టెలు జ్ఞాపకంవచ్చేవి. రాత్రిపూట దొడ్లో ఏం చప్పుడైనా "అడుగో రంగారావు! ఒకటో రెండో కట్టెలు లాక్కుంటున్నాడు." అనుకునేది.

ఓ రోజు రాత్రి పన్నెండున్నరకు సుందరమ్మకు మెలకువొచ్చింది. దొడ్లో కట్టెలు కదులుతున్నట్లు వినవచ్చింది. "ఇంకేం, రంగారావే!" అనుకుంది సుందరమ్మ.

"నిజం నిలకడమీద తెలుస్తుంది. పోయి చూడు" అని అంతరంగంలో ఆకాశవాణి పలికింది.

కుమారుణ్ణి నిద్రలేపింది సుందరమ్మ. దొడ్లోకి పోయాడు రాధాకృష్ణమూర్తి. లేతతనంలో ఉన్న కుర్రవాడు; రోషంతో ఏం పోట్లాడుతాడో, ఏం దెబ్బలాడుతాడో అని హడిలిపోతోంది. తానుగూడా దొడ్లోకి పోయింది.

దొడ్డినడమధ్య చకితుడై చూస్తున్నాడు రాధాకృష్ణమూర్తి. "ఏంరా అబ్బాయి!" అని మెల్లిగా పలకరించింది సుందరమ్మ.

"ఎంత పొరపాటే! ఎంత అపోహ!" అన్నాడు.

"ఏమిటిరా?" అన్నది.

"మన కట్టెలు దొంగిలిస్తున్నాడు రంగారావు అనుకున్నాం. నిజానికి మన కట్టెలు దొంగిలించడం లేదు. తన కట్టెల్లోంచి కొద్దికొద్దిగా మన కట్టెల్లో చేరుస్తున్నాడు పాపం ఆయన. చూడు!"

చూచింది సుందరమ్మ. నిజమే! వాళ్ల బీదరికానికి ఎవరూ సాయం చేయడం లేదనుకుంటే పిసినాసని పేరుపడ్డ రంగారావే సాయం చేస్తున్నాడు.

అందుకనే వెనకటిఇంట్లో తక్కువరోజులొచ్చిన కట్టెలు ఈ యింట్లో ఎక్కువరోజు లొస్తున్నాయి. పైగా ఎవరైనా దొంగిలిస్తున్నారేమో అని జాగ్రత్తపడుతున్నారు.

ధర్మంగా ఇచ్చినట్లిస్తే ఎన్నితడవ లియ్యాలి? ఏమనుకుంటారు? అందుకని అర్ధరాత్రి ఎవరికీ చెప్పకుండా తన కట్టెల్లోంచి తీసి ఈ బీదసంసారాని కిస్తున్నాడు రంగారావు.

కనకనే కంటితో చూడంది ఎవర్ని గురించీ ఏమీ అనుకోకూడదని ఒట్టెట్టుకున్నారు సుందరమ్మా, రాధాకృష్ణమూర్తీ.

పొరుగింటాయనతో పరిచయం చేసుకున్నాడు రాధాకృష్ణమూర్తి. పాపం ఆయన పిసినాసే కాడు! కూడపెట్టటమూ లేదు. వచ్చేదే స్వల్పం. అందులోంచి ఆడంబరం లేకుండా దానధర్మాలు చేస్తాడు.

హృదయపరివర్తనంతో సుందరమ్మ సంసారానికి ఆర్థికపరివర్తనంగూడా వచ్చింది.

"నాకు బిడ్డల్లేరు. మీ చిన్నబ్బాయికి నాబిడ్డల్లేనే నే బ్రతికున్నంతకాలం చదువుచెప్పిస్తాలే అమ్మా" అన్నాడు రంగారావు.

* * *

## 2. నమ్మకాలరిమ్మ

"ఎంతఆశ్చర్యంగా ఉంటుందీ కొంతమంది పిచ్చినమ్మకాలు చూస్తే!"అన్నది లక్ష్మి.

లక్ష్మి పుట్టినరోజుపండగ ఆరోజున. స్కూలు సావాసకత్తెలను పేరంటానికి పిలిచింది. తల్లి కామేశ్వరమ్మ ఫలహారప్పనుల్లో ఉంది. ఓమూల ముత్తవతల్లి సరస్వతమ్మ వత్తులు చేసుకుంటూ కూర్చుంది. తివాచీలమీద లక్ష్మిచుట్టూ సావాసకత్తెలు చేరి కబుర్లు చెపుతున్నారు.

పనిచేసే పోలాంకు అనేక పిచ్చినమ్మకాలు. మధ్యమధ్య గణం పెరుగుతుంది. ఆరోజు ప్రొద్దునే దానికి గణం పెరిగింది. ఆసంగతి మాట్లాడుతూ అన్నది లక్ష్మి.

"మూఢత్వం ఉన్నవాళ్లకే పిచ్చినమ్మకాలు జాస్తిగా ఉంటాయి"అన్నది అన్నపూర్ణ.

"విద్య ఉన్నవాళ్లుగూడా పిచ్చినమ్మకాలు పెట్టుకుంటారమ్మా. చాలామందికి సూచనలమీదా, శకునాలమీదా నమ్మకం ఉండడం పిచ్చేగాదు, తప్పు కూడాను. అయినా తెలుసుకోరు"అని తలెత్తకుండానే మాట్లాడింది సరస్వతమ్మ.

"నేను సుఖంగా ఉన్నానమ్మా—నాకేం పిచ్చి నమ్మకాలు లేవు." అని అందరివంకా చూచింది శ్యామల.

"నాక్కూడా రవ్వంతైనా ఏపిచ్చినమ్మకమూ లేదు "అంటూ శ్యామలవంక చూచింది లక్ష్మి.

"పిచ్చినమ్మకాలంటే నాకు రోత. మామతంలో అట్లాంటి వేమీ లేవు!"అని గర్వంతో చూచింది కిరస్తానీపిల్ల ఎమిలీ.

"పిచ్చిపిల్లల్లారా! లేవులేవు అనుకోకండి. మీ అందరిదగ్గిరా తలా వక పిచ్చినమ్మకం ఏదోఒకటైనా ఉంటుంది. దాన్ననుసరించే మీ జీవితాలూ నడుస్తూంటాయి. ఆ వక్కటికూడా లేకుండాఉంటేనే గొప్ప జీవితం. అప్పుడే జన్మకు పరివర్తనంవస్తుంది. మీకుమీరే ఆలోచించుకోండి" అన్నది సరస్వతమ్మ మళ్లా.

లక్ష్మి:—అదేమిటే అమ్మమ్మా అట్లాంటావు?

"అదేమిటండీ సరస్వతమ్మగారూ, అట్లాంటారు? మేం చదువుకుంటున్న పిల్లలం, మాకేమీ పిచ్చినమ్మకాలు లేవు."అన్నారు అంతా వకేసారి కలిసి.

సరస్వతమ్మగారంటే ఆ ఇరుగుపొరుగులో మర్యాదెక్కువ. చాలా చదువుకున్న మనిషి. ప్రపంచజ్ఞానం ఉంది. ఆరాధనాబలం గలిగింది. ఆ ఇరుగుపొరుగువాళ్లేమీ తోచనప్పుడావిడదగ్గిర కూర్చుని అదీ ఇదీ వింటూంటారు. అయితే లక్ష్మి, సావాసకత్తెలూ స్కూలులో చదువుకుంటున్నామనే గర్వంతో ఆవిడమాటలకు రోషపడ్డారు.

"అహా! నాకేమీ పిచ్చినమ్మకం లేదు... ఒక్క అలవాటుమాత్రం ఉంది, మీరేమైనా అనుకోండి. ఎవళ్లకీ బహుమానంగా చాకువంటి దివ్వను. నేను పుచ్చుకోను. 'పదునైందిస్తే స్నేహం పగిలిపోతుం'దని సామెత లేదుటోయి......ఒకసారి లీలా

వతికి చిన్న చాకొలెట్టిచ్చాను. వారంరోజులైంతర్వాత ఇద్దరం పోట్లాడుకున్నాం." అన్నది లక్ష్మి.

సర:—నాకు జ్ఞాపకంఉంది లేవే అమ్మాయి నీకూ, లీలావతికీ పోట్లాట. దాంతో కొత్తగా స్నేహం అయింది నీకు. కొత్తపిచ్చి కొత్తపిచ్చే. మొదట అతుక్కుపోయినా రిద్దరూనూ. రానురాను స్నేహం పాతగిలింది. అలుసైంది. పోట్లాడుకున్నారు. అంతేగాని నీచాకేం చేసింది?

శ్యామల:—నేనెవరైనా సావాసకత్తెతో నడిచి పోతూంటే ఇద్దరిమధ్యా ఎవర్నీ పోనీయను. అట్లా పోతే ఏదైనా ఆపదొస్తుందంటారు.

ఇట్లాగే కబుర్లు సాగాయి కొంతసేపు. ఆ మాటా యీమాటా ఆడుకోవడంలో అన్నపూర్ణ కేదో జ్ఞాపకం వచ్చి "ఏమోయి ఎమిలీ! మనకు మూడురోజులు సెలవులున్నాయి గదా. రైలుమీద వెళ్లితే గంటకన్నా పట్టదు. మరి మీ ఇంటి కెప్పుడు వెళ్దాం? మీ హాస్టలుకుగూడా సెలవేగా?"

ఎమిలీ:—సెలవేలే! నువ్వడిగిన పుస్తకాలివ్వడానికా? సరే రేపెళ్దాం.

అన్న:—రేపు మా యింట్లో ఏదో కార్యం ఉందోయి. ఎల్లుండి మా తాతయ్యతద్దినం. ఆవలెల్లుండి శుక్రవారం పోదాం.

ఎమిలీ:—శుక్రవారంనాడా? వద్దు. ఆరోజు ప్రయాణం చేయకూడదు.

అంటూనే సరస్వతమ్మగారివంక చూచి సిగ్గుపడ్డది. సరస్వతమ్మ ఏమీ అనలేదు. తనలోతాను నవ్వుకుంది.

లోపలనుంచి కామేశ్వరమ్మగారు బయట కొచ్చి "రండోయి పిల్లల్లారా! ఈ గదిలోకి రండి. బల్లలమీద ఫలహారాలు పెట్టాను." అన్నది. అందరూ గదిలోకి పోయారు. సరస్వతమ్మమాత్రం కూర్చున్న చోటే ఉండి "ఎవరికి కావాలిసింది వాళ్లు సిగ్గుపడకుండా తినండి పిల్లల్లారా. ఇక్కడ్నుంచి కనబడుతూనే ఉంటారు. వినబడుతూనూ ఉంటారు" అని నవ్వింది.

గదిలోకి పోయాక అందరూ బల్లలముందు కూర్చున్నారు. లక్ష్మితమ్ముడు పన్నెండేండ్లవాడు రాజేశ్వరరావూ ఉన్నాడందులో.

బల్లచుట్టూ ఒకసారిచూసి "అమ్మో!" అని లేచింది ఎమిలీ.

"ఏమిటమ్మా ఆ భయం?" అని అడిగింది కామేశ్వరమ్మ.

"ఏమీ లేదండీ! మనమంతా పదముగ్గురం ఉన్నాం ఇక్కడ. ఇది చాలా అశుభమండీ. పోనీ నేను తర్వాత వస్తాను లేండి!" అన్నది ఎమిలీ.

"అదేమిటమ్మా అంతా కూర్చున్న తర్వాత లేవకూడదు. పేరంటానికి మా యింటి కొచ్చిందానివి నువ్వు కూర్చో...ఒరే అబ్బాయి రాజీ, నీవు నీ ఫలహారం తీసుకుపోయి అమ్మమ్మదగ్గర కూర్చుని తిను." అన్నది మర్యాదగా కామేశ్వరమ్మ.

ఎమిలీని కొరకొరా చూస్తూ వెళ్లాడు రాజేశ్వర్రావు.

ఫలహారం అయి మళ్లీ హాలులో కొచ్చి కూర్చున్న తర్వాత అన్నది ఎమిలీ: "నాకేమీ పిచ్చినమ్మకాలు లేవనుకున్నానండీ. ఇదొక్కటే ఉంది. పాపం అందరితో కలిసి తినకుండా ఆ కుర్రాడవతలికి వెళ్లాడు. క్షమించండి నన్ను!"

సరస్వతమ్మ అన్నది: "ఫరవాలేదులే అమ్మాయీ. మా యిల్లేగా? అయినా మీ అందరు ఆడపిల్లల్లో వాడొక్కడే మొగవాడు. ఇవతలకొస్తే ఏం లేదులే. సరేకాని, నాకు పిచ్చినమ్మకంలేదంటే నాకు లేదని విశ్రపీగారుగదా, ఇప్పటికైనా అర్థమయిందా?"

"అసలీనమ్మకాలకు మూలకారణా లేమిటో తెలుసునటండీ?" అని అడిగింది అన్నపూర్ణ.

"ఆ! చెపుతా వినండి నాకు తెలిసినంత వరకూ" అన్నది సరస్వతమ్మ.

అంతా ఆవిడకు, మరీదగ్గరగా వచ్చి కూర్చున్నారు.

సర:—వీటిల్లో కొన్ని నమ్మకాలు వేలసంవత్సరాల్నుంచీ వస్తున్నాయి. మొదటిది విచారించుదాం.

చాకు బహుమానంగా ఇవ్వకూడ దంటారు. ఎందుకూ? పూర్వకాలంలో ఇప్పుడున్నంత నాగరికత లేదు. వీరులంతా బొడ్లో కత్తులు పెట్టుకుని నివసించేవాళ్లు. ఎక్కడికెళ్లినా కత్తి ఉండాలి. ఆరోజుల్లో ఒకడు ఇంకోడికి కత్తి ఇచ్చాడనుకోండి. ఏమో, వాడు ఆకత్తితోనే వీణ్ణి పొడిస్తే? అంత అపనమ్మకపు రోజుల్లోంచి వచ్చింది ఆ నమ్మకం.

ఇద్దరు స్నేహితులు పోతూంటే మధ్య ఎవర్నీ రానీకూడ దంటారు. ఇదీ పూర్వంనుంచీ వస్తున్నదే. ఇద్దరు వీరులు కలిసి యుద్ధానికి పోతూంటే తమ నిద్దర్నీ ఏదీకూడా విడదీయకూడదని ఒట్టెట్టుకునేవాళ్లు.

మీకు తెలుసా కిరస్తానీవాళ్లు శుక్రవారం ప్రయాణం చేయకూడదని ఎందుకనుకుంటారో? ఆ రోజుననే వాళ్ల క్రైస్తును అన్యాయంగా చంపింది. ఆ మొదటిరోజుల్లో ఆయనశిష్యులు ఆరోజున ప్రార్థనలు చేస్తూ ఎక్కడికీ కదిలేవాళ్లు గారు. ఈరోజుల్లో అర్థంలేదు.

లక్ష్మి—కిరస్తానీవాళ్ల కథలు నీ కెట్లా తెలుసమ్మమ్మా?

సర:—నేను రెండుకాన్పులకు వాళ్ల ఆసుపత్రి పోయానే. అప్పుడాసంగతులు కొన్ని తెలుసుకున్నా.

పదముగ్గురు కూర్చోగూడ దనే మాటా అంతే. క్రైస్తు చనిపోబోయేముందు ఆయన శిష్యు లందరితో కలిసి భోజనం చేశాట్ట. పదముగ్గు రున్నారట. ఆ తర్వాత ఆయనేమో పోయాడు. అప్పట్నుంచీ అదో నమ్మకం పాతుకుపోయింది వాళ్లల్లో.

సరస్వతమ్మ మాట్లాడుతూనే ఉంది. తులసీ, లక్ష్మి అంత శ్రద్ధతో వినడంలేదు. ఓ బంతి దాని చేతుల్లోంచి ఇదీ, దీని చేతుల్లోంచి అదీ ఎగరేస్తూ ఎగతాళాడుకుంటున్నారు. కొంతసేపటికి లక్ష్మి బంతిని కొంచెం విసురుగా వేసింది. తులసి పట్టుకో లేదు. బంతి ఎగిరి గోడమీద ఉన్న చిన్న చూపుటద్దంమీద పడ్డది. అద్దం అసలాటుంగా ఉందికాబోలు, కిందపడి పగుళ్లు విచ్చింది.

"ఛీఛీ, ఎంత తెలివితక్కువ! ఎంత పీడ! నా పుట్టింరోజు పండగరోజున నేనే నాఅద్దం పగలకొట్టు కున్నాను. ఏం గ్రహచారం పట్టుకుంటుందో!" అనుకుంటూ విచారిస్తున్నది లక్ష్మి.

"ఏదీ, ఆ అద్దం ఇటు చూపించు. ఎబ్బే! కొంచెం పగుళ్లువిచ్చిందిగాని ముక్కలవలేదులే. పీడా లేదు, తేడా లేదు. ఇప్పుడేగా మీఅందరికీ నేను చెప్పిందీ ఈనమ్మకాలన్నీ పిచ్చివనీ—విచారించవాకు. ఉంకోఅద్దం కొనుక్కో. పుట్టింరోజుపండగనాడు కొత్తద్దం వచ్చిందనుకో!" అన్నది సరస్వతమ్మ.

"నిజమేనండీ! మామనస్సులు మార్చుకోవాలి. ఎంత చదువుకుంటే ఏం లాభం? మనస్సులు మారకుండా, నమ్మకాలు విడవకుండా!" అని ఆ పిల్లలంతా ఒక్కొక్కళ్లే అంటూ లక్ష్మితో చెప్పి ఎవరింటికి వారు పోయారు.

లక్ష్మివిచారం ఇంకా పూర్తిగా పోలేదు. ఆ అద్దం తీసుకుని ఇటూ అటూ తిప్పుతూ ఆ పగుళ్లను కదిలించింది. అందులోంచి ఒక ముక్క బయటపడ్డది. లోపల ఏదో కాగితం కనబడ్డది లక్ష్మికి. ఆశ్చర్య పడుతూ ఏమిటా అని మెల్లిగా ఆముక్కలన్నీ తీసి ఆ కాగితం లాగింది.

"ఓహో! ఇదేదో తాతయ్య వ్రాసినట్టుగా ఉందే!" అనుకుంది. సరస్వతమ్మదగ్గిర కూర్చొని "అమ్మమ్మా! ఇదేమిటో తెలుసా? చూడు. ఇదేనే పోయిందనుకున్న తాతయ్యవీలునామా. పూర్తిగా చదువుతా ఉండు!" అని చదివింది. తల్లి కామేశ్వరమ్మగూడా విన్నది. వింటూ ఇట్లా అన్నది: "మీ నాయనా, మీ పెదనాయనా ఎప్పుడూ పోట్లాడుకునే వాళ్లే. అందుకని మీతాత యీఉపాయం పన్నినట్లున్నాడు. వీలునామా అద్దంలో పెట్టాడు. అందుకనే పాపం చావుమంచంమీద 'నారాయణా' అనమంటే 'అద్దం అద్దం' అనేవాడు. అంతకన్నా అనడానికి వాక్కు పడిపోయింది. పాపం! ఆయన

పోయింతర్వాత ఆస్తి చెరిసగం అయింది. ఏం రాశాడు మళ్లీ చదువు!"

"పిత్రార్జితంఆస్తి సరే చెరిసగములే. తాను సంపాదించినాస్తి పెద్దవాడు పెళ్లీ, గిళ్లీ లేకుండా తిరుగుతున్నాడుగనక చిన్నవాడికే పూర్తిగా పోవాలిసే! అమ్మోయి,అయితే ఆమేడలు రెండూ,మామిడి తోటా మనకే వస్తాయి తెలుసా" అన్నది వీలునామా చదువుతూ లక్ష్మి.

"ఇప్పుడు గ్రహించావా లక్ష్మి!" అన్నది ముత్తవతల్లి సరస్వతమ్మ. "అద్దం పగిత్తే పీడన్నావుగా! పీడ పోయి మేడలొచ్చాయిగా!"

"ఇహనుంచీ నా మనస్సు మార్చుకుంటానమ్మమ్మా! పిచ్చినమ్మకాలేవీ మనస్సులో పెట్టుకోను. మాబళ్లో జ్ఞానంకన్నా నువ్వు చెప్పిన జ్ఞానం బాగా ఉందమ్మమ్మా!" అన్నది సంతోషంతో లక్ష్మి.

